కేరీర్ గైడెన్స్, పోటీ పరీక్షలపై అవగాహన

హయత్‌నగర్, ఫిబ్రవరి 20 : హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కేరీర్ గైడెన్స్, ప్రవేశ పరీక్షలు, పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కేరీర్ గైడెన్స్ సెల్ ఇన్‌చార్జి డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్య ఐసెట్, లాసెట్, ఎడ్‌సెట్, కామన్ పీజీ సెట్, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులపై వివరించారు. అనంతరం ముఖ్య వకల్తుగా హాజరైన హారతి, వంశీకృష్ణారెడ్డి, శ్రీధర్‌లు మాట్లాడుతూ.. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఐబీపీఎస్ లాంటి పరీక్షలపై సిలబస్, ఈ పోటీ పరీక్షల్లో ఎలా విజయం సాధించాలో విద్యార్థుల సందేహాలపై నివృత్తి చేశారు. ఐసెట్, మొబైల్ యాప్ యాక్టివేషన్ వీడియో ఉపన్యాసాలను విద్యార్థులు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహ, టీఎస్ కేసీ కోఆర్డినేటర్ మక్క, భౌతిక శాస్త్ర విభాగాధిపతి అవేసు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యాదగిరి రెడ్డి, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రమాదేవి, శారదా దేవి, బాల, ఫిజికల్ డైరెక్టర్ అనిత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

28లోపు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోండి

పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్

కందుకూరు, ఫిబ్రవరి 20 : రైతులు తీసుకున్న రుణాలను ఈనెల 28లోపు చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి 28 లోపు ఏడు శాతం వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. ఏడు శాతంతో చెల్లించిన రైతులకు మూడు శాతం వడ్డీ రాయితీ ప్రభుత్వం తిరిగి ఇస్తుందని పేర్కొన్నారు. 28 తర్వాత చెల్లిస్తే 13.75 శాతం రుణం చెల్లించాలని అన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి నిమ్మ యాదిగిరి రెడ్డి పాల్గొన్నారు.

మహేశ్వరం నియోజకవర్గం, జల్‌పల్లి మున్సిపాలిటీ, పహాడీ షరీఫ్ బాసావ్‌గుట్ట షర్ఫుద్దీన్ దర్గాలో 759వ ఉర్సు కార్యక్రమంలో భాగంగా గురువారం ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, తదితరులు హాజరై బాబా షర్ఫుద్దీన్‌కు పూలు, చెద్దరు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, నాయకులు ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు
– బడంగ్‌పేట, ఫిబ్రవరి 20

బీఆర్ఎస్ మహిళా కార్యకర్తకు నివాళి..

మహేశ్వరం మండలం, కోళ్లపడకల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మహిళా కార్యకర్త తాళపల్లి అంజమ్మ మృతి చెందగా...విషయం తెలుసుకున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆమె పార్థీవ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హన్మగాళ్ల చంద్రయ్య, మాజీ సర్పంచ్ నర్సింహ గౌడ్, మాజీ ఉప్ప సర్పంచ్ ఆవుల మల్లేశ్, మెంట శేఖర్, గ్రామశాఖ అధ్యక్షుడు రఘుపతి, తదితరులు పాల్గొన్నారు. – బడంగ్‌పేట, ఫిబ్రవరి 19

26, 27న నైట్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

హయత్‌నగర్, ఫిబ్రవరి 20 : ఈనెల 26, 27న మహాశివరాత్రి సందర్భంగా హయత్‌నగర్‌లో బ్యాడ్మింటన్ నైట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు రాజారావు యాదవ్, గజ్జి నరసింహ యాదవ్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గజ్జి యాదయ్య, రాజమ్మల జ్ఞాపకార్థం హయత్‌నగర్, ఎస్‌వీఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన నైట్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాడ్మింటన్‌లో పాల్గొనేవారు ఈ నెల 18, 19వ తేదీల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, సాయంత్రం 6 గంటల వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వివరించారు. ఎంట్రీ ఫీజు రూ.800 ఉంటుందని, విజేతలకు రూ.లక్ష వరకు విలువైన బహుమతులు అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ : 97045 41579, 849956055 లలో సంప్రదించాలని కోరారు.

యాదయ్య త్యాగం మరువలేనది..

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 20 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన ప్రాణాలను బలిదానం చేసుకున్న సిరిపురం యాదయ్య త్యాగానికి వెలకట్టలేమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం మండల పరిధిలోని నాగారంలో ఉద్యమకారుడు సిరిపురం యాదయ్య 15వ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ కోసం అగ్నికి ఆహుతి అయిన సిరిపురం యాదయ్య త్యాగాన్ని తెలంగాణ ప్రజలు మర్చిపోలేరన్నారు. యాదయ్య మరణంతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసినట్లు అయ్యిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇక రాదేమోన్న బాధతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మబలిదానం చేసుకోవడం జరిగిందన్నారు. యాదయ్య మరణించిన్నా ఆయన ఆశయాలు ఉన్నాయన్నారు. యాదయ్య కుటుంబానికి టీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. చైర్మన్ మంచే పాండు యాదవ్, మాజీ సర్పంచ్ రాజేశ్, కృష్ణ, సంజీవ్, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపేట చౌరస్తాలో..

ఆర్కేపురం, ఫిబ్రవరి 20 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన వీరుడు సిరిపురం యాదయ్య అన్ని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాస్కీ గౌడ్, భాస్కర్‌రెడ్డిలు అన్నారు. గురువారం సిరిపురం యాదయ్య 14వ వర్ధంతిని కొత్తపేట చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

50 శాతం రిజర్వేషన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి

బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయ నాయుడు, చిత్రంలో కృష్ణ , తదితరులు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 20 : స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు అన్నారు. గురువారం నాగోల్‌లోని ఎస్‌పి డాంగే భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి సభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఇంతకుముందు జరిగిన కులగణన సర్వేలో పాల్గొననివారు ఇప్పుడు ప్రభుత్వం చేపట్టిన సర్వేలో పాల్గొని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, బీసీల జనాభాను తక్కువ చేసి చూపించినట్టుగా వస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. బీసీ హక్కు ల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యద ర్శి బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ .. రాష్ట్రంలో ఈనెల 28 వరకు జరుగుతున్న కులగణనలో బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు ప్రత్యేక సర్వేలో నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకుడు నరసింహ, రూపాని లింగస్వామి, యాదయ్య పాల్గొన్నారు

ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

సైదాబాద్, ఫిబ్రవరి 20 : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గురువారం వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, శాసన సభ్యులు జాఫర్ హుస్సేన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను గిరిజన ప్రజలు ఆచరించాలని వారు పిలునిచ్చారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

చేనేత కార్మికుల సమస్యలపై హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సీతారాములు, తదితరులు

మన్సురాబాద్, ఫిబ్రవరి 20: చేనేత కార్మికులకు కనీస వేతనాల అమలు, రుణమాఫీ, నగదు బదిలీ, త్రిఫ్ట్ పథకంలో చేనేత కార్మికుల డిపాజిట్ పెంచుట ..తదితర అంశాలపై గురువారం హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌కు మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఆధ్వర్యంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నేతన్నలు చేసిన కష్టానికి తగిన ప్రతిఫలం పొందలేక ఆర్థికపరమైన ఇబ్బందుల్లో కూరుకుపోయారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా చేనేత కార్మికుల కు కనీస వేతనాలను అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరి గా సబ్సిడీ కింద నగదు బదిలీ పథకం ద్వారా కార్మికుడికి రూ.2వేలు, అనుబంధ కార్మికులకు రూ. 500 నుంచి రూ. 600 అందజేయాలని కోరారు. చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేయడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు వనం శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, సలహాదారుడు కూరపాటి రమేశ్, కార్యదర్శి నరహరి, కమిటీ సభ్యులు గుండు వెంకటనర్సు, గుర్రం నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

60 లక్షలతో సుందరీకరణ పనులు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 20: ఎల్బీనగర్ కామినేని చౌరస్తాలో రూ. 60 లక్షలతో చేపడుతున్న సుందరీకరణ పనులను గురువారం మనసురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామినేని చౌరస్తాలో అందమైన ఫౌంటెన్ ఏర్పాటు చేసి సుందరీకరణ చేస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా చౌరస్తా మధ్యలో ఉన్న వైఎస్సార్ విగ్రహం చుట్టూ ప్రాంతాన్ని కుదించడం జరిగిందని పేర్కొన్నారు. కామినేని ఫ్లైఓవర్ కింద ఏర్పాటుచేసిన ఆక్సిజన్ పార్కును త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యంజాల జగన్, పారంద సాయి , తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కృషి

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దేవీలాల్ నాయక్, బాబు భద్రయ్య

కందుకూరు, ఫిబ్రవరి 20 : గ్రామాలతో పాటు గిరిజన తండాల అభివృద్ధికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కృషి చేస్తున్నారని మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ కాట్రోత్ దేవీలాల్ నాయక్ తెలిపారు. గుమ్మడవెల్లి తండా గేట్ నుంచి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.80 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ పనులను గురువారం మాజీ సర్పంచులు భద్రయ్య, మస్కు బాబులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంతో పాటు తండా అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. సబితా ఇంద్రారెడ్డి రోడ్లకు నిధులు మంజూరు చేసి పనులను పూర్తిచేస్తే .. కాంగ్రెస్ నాయకులు మాత్రం మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నిధులు మంజూరు చేశారని పేర్కొనడం సిగ్గు చేటని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు అభివృద్ధికి నిధులు తీసుకురావాలని కోరారు. పార్టీలకతీతంగా అభివృద్ధి విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు . ఈ కార్యక్రమంలో మల్లేశ్, రాజు నాయక్, గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన రీ సర్వేలో పాల్గొనండి..

డాక్టర్స్ కాలనీలో నిర్వహించిన కులగణన రీ సర్వేను పరిశీలించిన బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తదితరులు

ఆర్కేపురం, ఫిబ్రవరి 20 : కులగణన రీసర్వేలో అందరూ పాల్గొనాలని బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్ పిలుపునిచ్చారు. సరూర్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో గురువారం ఆయన పర్యటించి.. గతంలో కుల గణనలో పాల్గొనని వారిని కలిసి ఈసారి వివరాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ కారణాలలో కులగణనలో పాల్గొనని వారిని కలిసి వివరాలు తీసుకునేందుకు ప్రభుత్వం రీ సర్వే చేయాలని నిర్ణయించిందని వివరించారు. కులగణన రీ సర్వే తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు తాము పర్యటిస్తున్నామని చెప్పారు. వక్కలంక శ్రీనివాస్‌రావు, శంకర్‌యాదవ్, వన్నాడి శ్రీనివాస్, ధన్‌రాజ్ గౌడ్, తదితరులు ఉన్నారు.

ఆయుర్వేద వైద్య నిపుణులు రాజుకు సన్మానం

సైదాబాద్, ఫిబ్రవరి 20 : ఆయుర్వేద వైద్య నిపుణులు పొదిలి రాజును ఆల్ ఇండి యా బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి పాండే సన్మానించారు. రెండు రోజులపాటు నాగపూర్‌లో జరిగిన అఖిల భారత కార్మిక మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) బొగ్గు గనుల కార్మికుల అఖిల భారత మహసభల్లో రాజును సన్మానించారు. ఈ మహసభలో వెంకటేశ్వర ఆయుర్వేద వైద్యులు పొదిలి రాజు పేద ప్రజలకు చేస్తున్న సేవలను వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా 700 మంది కార్మికులకు ఆయుర్వేద మందులను ఉచితంగా అందిం చారు. కార్యక్రమంలో బీఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పాండే, లక్ష్మారెడ్డి, నాయకులు చెవ్వ మహేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

25న సెమినార్

బడంగ్‌పేట, ఫిబ్రవరి 20: సీపీఐ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 25న తుక్కుగూడ లక్ష్మీ గార్డెన్‌లో జిల్లాస్థాయి సెమినార్ నిర్వహిస్తున్నామని సీపీఐ నాయకులు దత్తు నాయక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు పాల్గొంటారని అన్నారు. ఈ సమావేశానికి గ్రామ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, ఫిబ్రవరి 20 : విజయపురి, హనుమాన్‌నగర్, గోటేటి ఫంక్షన్‌హాల్, సాయినగర్, సమతాపురి, వీ–గార్డ్ 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ విద్యుత్‌శాఖ డీఈ రామకృష్ణ తెలిపారు. విజయపురి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విజయపురి కాలనీ, లక్ష్మీనగర్, ఎస్‌బీఐ కాలనీ, టెలిఫోన్ కాలనీ రోడ్డు నం.1, కొత్తపేట్ ప్రధాన రహదారి, రిలయన్స్ పరిసర ప్రాంతాల్లో..

హనుమాన్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 2గంటల వరకు సాయినగర్ రోడ్డు నం.1,2,3, చాణిక్య పురికాలనీ, హనుమాన్‌నగర్ పరిసర ప్రాంతాల్లో, గోటేటి ఫంక్షన్‌హాల్ ఫీడర్ పరిధిలో రాక్‌టౌన్ రోడ్డు నం.1,2,3, సాయినగర్, లలితానగర్ పరిసర ప్రాంతాల్లో, సాయినగర్ ఫీడర్ పరిధిలో కో–ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ, లలితానగర్ పరిసర ప్రాంతాల్లో, సమతాపురి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు సమతాపురి కాలనీ, ఓల్డ్ సమతాపురి కాలనీ పరిసర ప్రాంతాల్లో, వీ–గార్డు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4గంటల వరకు వాంబే కాలనీ, మన్సూరాబాద్, విశాలాంధ్ర, రాక్‌టౌన్, బిగ్ బజార్ వెనుక ప్రాంతం, బాలాజీనగర్ ప్రాం తాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఆడియాలజీ, ఎమ్మెస్సీ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ కోర్సుల మొద టి మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చేనెల 11 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

విద్యార్థులు సన్మార్గంలో పయనించాలి

తిమ్మాయిపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో విద్యార్థులు

కందుకూరు, ఫిబ్రవరి 20 : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని తిమ్మాయిపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ రహీం అన్నారు. గురువారం మండల పరిధిలోని తిమ్మాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా విద్యాధికారిగా ఆదిత్య , ప్రధాన ఉపాధ్యాయులుగా నీలం కుమార్, మండల విద్యాధికారిగా సాంకేత్, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి.. తరగతిగదిలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావే శంలో ప్రధాన ఉపాధ్యాయులు అబ్దుల్ రహీం మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలని కోరారు. విద్యార్థులు సన్మార్గంలో పయనించాలని కోరారు. విద్యార్థులు ఉపాధ్యాయ వృత్తిని ఒకరోజు చక్కగా బోధించారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనసూయ, అంజయ్య, హేమ, మాళిని, విజయ, ప్రమీల, అంజనాదేవి, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

9 ఏండ్లు.. 108 సార్లు స్వామివారి కల్యాణం

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గుబ్బ లింగేశ్వర్, కోశాధికారి వాడకట్టు నరేందర్, ఉపాధ్యక్షులు చింతల సంఘమేశ్వర్, గజవెల్లి సాంబమూర్తి, నాంపల్లి శ్రీనివాస్, చందా భాస్కర్, జూలూరు శ్రీనివాస్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కేపురం, ఫిబ్రవరి 20 : లోక కల్యాణార్థం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జన్మదినం సందర్భంగా 9 సంవత్సరాల పాటు 108 సార్లు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ వైభవ ట్రస్ట్ అధక్షుడు జగిని శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. గురువారం ఆర్కేపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 9 సంవత్సరాల పాటు 108 కల్యాణాలు స్వామివారికి జరిపించాలనే దైవ సంకల్పంతో 9 మందితో ట్రస్ట్ ఏర్పాటు చేశామని చెప్పారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఏప్రిల్ 4, 2022 నుంచి నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 37 సార్లు నిర్వహించామని తెలిపారు. 2031 ఫిబ్రవరి వరకు మిగిలిన కల్యాణాలను నిర్వహిస్తామని చెప్పారు. ఎవరైనా భక్తులు కల్యాణం జరిపించాలనుకుంటే సెల్.9246736533, 9848066156 కు సంప్రదించాలని కోరారు.

ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్–ఈవినింగ్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 27వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 300 అపరాధ రుసుముతో వచ్చేనెల 3వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

ఎంసీఏ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంసీఏ పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 21వ తేదీ వరకు సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చని చెప్పారు.

వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ కోర్సుల మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

ఉత్తమ సాధనతోనే మెరుగైన ఫలితాలు

సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో స్కూల్ ప్రిన్సిపాల్ అంజనీదేవి

హయత్‌నగర్, ఫిబ్రవరి 20 : విద్యార్థులు ఉత్తమ సాధనతోనే మెరుగైన ఫలితాలు సాధిస్తారని సాయినగర్ విద్యాలయ ప్రిన్సిపాల్ అంజనీదేవి అన్నారు. గురువారం క్యాట్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన హయత్‌నగర్‌లోని సాయినగర్ శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులను ఏజీఎం సతీశ్ అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న 108 విద్యార్థులు పాల్గొనగా ఆరుగురు విద్యార్థులు ప్రైజ్‌మనీ, 29 మంది విద్యార్థులు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్, 45 మంది విద్యార్థులు సర్టిఫికెట్లను సాధించారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించగలిగామన్నారు. టీచింగ్ మెథడాలజీ, సీబ్యాచ్ వంటి అకాడమిక్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీసి అద్భుతమైన ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆర్ఐ వెంకట్ రెడ్డి, కోఆర్డినేటర్ రఘువంశీ, డీన్ రఘుపతి, సి–బ్యాచ్ ఇన్‌చార్జి సోమయ్య, ఒలంపియాడ్ ఇన్‌చార్జిపూజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గురు నిందితులు అరెస్ట్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 20: ఓ వ్యక్తిని బెదిరించి సెల్ ఫోన్‌తో పాటు నగదును అపహరించిన కేసులో ముగ్గురిని నాగోల్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అంబర్‌పేట, తిలక్ నగర్‌కు చెందిన షానవాజ్ ఆటోడ్రైవర్, మాడపల్లి స్వప్న గృహిణి. గోకుల్‌నగర్‌కు చెందిన తలపుల నవీన్ కారు వాషింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఈ ముగ్గురు కలిసి ఆటోలో రాత్రిపూట తిరుగుతూ ఒంటరిగా ఉన్న వ్యక్తులను బెదిరించి సెల్ ఫోన్లు, నగదును అపహరిస్తుంటారు. ఈనెల 17న రాత్రి 10: 20 గంటల సమయంలో రమేశ్ అనే వ్యక్తి అల్కాపురి వద్ద రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో ముగ్గురు ఆటోలో వచ్చి అతడిని బెదిరించి సెల్‌ఫోన్‌తో పాటు రూ. 2 వేల నగదును అపహరించుకొని పోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి..గురువారం ఆ ముగ్గురిని అరెస్ట్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

మలక్ పేట, ఫిబ్రవరి 20: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని చాదర్‌ఘాట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం చాదర్‌ఘాట్ ఎస్సై భరత్ కుమార్ విధులు నిర్వహిస్తుండగా, గ్యాస్ పెట్రోల్ పంపు వద్ద గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడని సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లి చూసి 108 కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

పెయింటర్ మృతి

హయత్‌నగర్, ఫిబ్రవరి 20 : అనుమానాస్పద స్థితిలో ఓ పెయింటర్ మృతి చెందాడు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం...హయత్‌నగర్ డివిజన్‌లోని రంగనాయకులగుట్ట, సుధీర్ కుమార్ కాలనీకి చెందిన సోమారపు వెంకన్న(45)కు భార్య పూలమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. గొడవల కారణంగా వెంకన్న పెద్దఅంబర్‌పేటలో ఉంటూ పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. కాగా.. మధ్యాహ్నం 3.30 గంటలకు పెద్దఅంబర్‌పేటలోని ఓల్డ్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో వెంకన్న పడి ఉన్నాడు. స్థానికులు గమనించి 100 డయల్ చేయగా .. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహా న్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుని భార్య పూలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.